క్లుప్తంగా

అంగన్‌వాడీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

సీతంపేట: అంగన్‌వాడీ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పాతపట్నం, సారవకోట ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న వర్కర్స్, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్ ఉద్యోగాలకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం 23 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, టెక్కలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రసాదరావు, పాతపట్నం సీడీపీఓ విమలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాళ్లు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో జూలై 2023లో జరిగిన ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్ కుమార్, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.జగదీశ్వరరావుతో కలిసి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌లో తమ విద్యార్థులకు 150 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు.

ప్రకృతి సాగుపై అవగాహన ర్యాలీ



నులకజోడులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విద్యార్థుల ర్యాలీ

భామిని: మండలంలోని నులకజోడులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఏడాదిలో పూర్తి కాలం భూమిని పచ్చని పంటలతో నిండుగా ఉండేలా రబీ డ్రై సోయింగ్ అభియాన్‌పై నినాదాలు చేస్తూ వివరించారు. ప్రధానంగా రైతు కుటుంబం ఆరోగ్యం కోసం కూడా సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించి తక్కువ పెట్టుబడితో పంటలు సాధించాలన్నారు. భూమి, నీరు, వాతావరణంలో కాలుష్యం తగ్గి భూతాపం తగ్గిస్తుందని నినదించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వి.ప్రభాకర్, వి.ఆంభోజీ, బి.ధర్మారావు, సాంబ ారో, ఉదయ్, సంధ్యతో పాటు పాఠశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

జియ్యమ్మవలస: డీఎస్సీ – 98 ఎంటీఎస్ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు అన్నారు. ఆ ఉపాధ్యాయులతో ఎంఈఓలు గురువారం తమ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా బోధిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. సమయపాలనలో కూడా ముందు ఉన్నారని అభినందించారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. టీచర్ డైరీ, లెసన్ ప్లాన్, టీఎల్ఎం సంబంధిత రికార్డులు ఎప్పటికప్పుడు రాసుకోవాలని సూచించారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీతో గ్రామాభివృద్ధి

వీరఘట్టం: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధి సాధించుకుందామని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు అన్నారు. నడుకూరు సచివాలయం వద్ద గ్రామసభ గురువారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే పనులను గుర్తించాలని అధికారులకు సూచించారు. గ్రామాభివృద్ధికి సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఏపీఓ జి.సత్యంనాయుడు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఉదాసీనత తగదు

భామిని: ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం తగదని, వివిధ రకాల యాప్‌లతో పని భారం పెరిగి బోధనపై దృష్టి సారించలేక పోతున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆరిక భాస్కరరావు, కె.కృష్ణారావు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. భామిని మండలం బాలేరు హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ సమావేశాల్లో సమస్యలపై చర్చించి మాట్లాడారు.

ప్రభుత్వం దృష్టికి గిరిజన సమస్యలు

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు



గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం దృష్టికి గిరిజనుల సమస్యలు తీసుకెళ్లి సకాలంలో పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. గురువారం ఆయన గుమ్మలక్ష్మీపురం మండలంలో పర్యటించారు. తన పర్యటనలో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలోని చెముడుగూడ గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన రోగులు, వైద్యులతో మాట్లాడుతూ అందుతున్న, అందజేస్తున్న వైద్యసేవలపై ఆరా తీసారు. సురక్ష శిబిరానికి ప్రజాస్పందన చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కన్నయ్యగూడ గ్రామంలోని సవరలిపి సంరక్షణ పాఠశాలను సందర్శించారు. భవిష్యత్ తరాలకు గిరిజన భాషలు, సంస్కృతి, సంప్రదాయాలు అందివ్వాలని గిరిజనులతో అన్నారు. సవరభాష(లిపి) మాట్లాడే గిరిజనులతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల భాషల్లో మంచి భావాలు, సంస్కృతి, చైతన్యం, చరిత్ర ఉంటుందని, భాష, సంస్కృతిని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గిరిజనులు వినతుల రూపంలో అందజేసిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చైర్మన్ శంకరరావు హామీ ఇచ్చారు. తన పర్యటనలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వినతులు స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సవర భాషా వలంటీర్లకు గౌరవ వేతనం పెంచాలని కోరుతూ ఆ సంఘం అధ్యక్షులు బి.భీమారావు డీవీజీకు వినతిపత్రం అందజేశారు. నీలకంఠాపురం పంచాయతీ కంబమానుగూడ గ్రామానికి చెందిన 20 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు ఎ.రమేష్, ధర్మారావు తదితరులు వినతిపత్రం అందజేశారు. ఏనుగుల నుంచి నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్మధరావు, నాయకులు జి.నూకయ్య వినతిపత్రం అందజేశారు. కురుపాం మండలంలోని గొటివాడ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని టి.కోటేశ్వరరావు, గిరిజన ప్రాంతంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు మండంగి రమణ, ఎల్విన్‌పేట పంచాయతీలో ఖాళీగా ఉన్న అటవీశాఖ భూముల్లో 350 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పలువురు గిరిజనులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య సేవలతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఎం.రాధిక, పార్వతీపురం ఐటీడీఏ డీడీ కె.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఏటీడబ్ల్యూఓ సురేష్ కుమార్, టీడబ్ల్యూ ఈఏ ఎస్.అప్పారావు తదితరులున్నారు. మండలం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును స్థానిక ఏటీడబ్ల్యూఓ కార్యాలయం వద్ద ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లొబ్బ లోవరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, ఇతర సభ్యులు సన్మానించారు. అలాగే పలు సమస్యలను విన్నవించారు.

రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



నాగరగూడ గ్రామ రహదారి నిర్మాణానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని మరిపల్లి పంచాయతీలోని నాగరగూడ గిరిజన గ్రామానికి రెండు కిలోమీటర్ల మేర మంజూరైన బీటీ రహదారి నిర్మాణానికి ఆమె గురువారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.60కోట్లతో బీటీ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రతీ గిరిజన గ్రామానికి రహదారి వేయడమే లక్ష్యమన్నారు. రహదారి నిర్మాణాలు జరిగితే ఇక ప్రతీ గిరిజన గ్రామానికి మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం అందుతాయన్నారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, సర్పంచ్ రాజయ్య, ఎంపీటీసీ విద్యారాణి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, గిరిజన సంఘం నాయకులు ఇంటికుప్పల రామకృష్ణ, వైస్ ఎంపీపీలు రంగారావు, బిడ్డిక అన్నాజీరావు, బిడ్డిక అనంత్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణాంశాలు పకడ్బందీగా అమలు చేయాలి



టీఎల్ఎం మెటీరియల్ ప్రదర్శిస్తున్న డిప్యూటీ ఈఓ తదితరులు

సీతంపేట: శిక్షణాంశాలు పకడ్బందీగా తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలని ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి ఎ.లిల్లీరాణి అన్నారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మూడు అసిస్టెంట్ ట్రైబుల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరిధిలో ఉన్న గిరిజన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం డీఆర్పీలతో గురువారం ఇప్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అన్నారు. చక్కనైన అంశాలు నేర్చుకుని వినూత్న రీతిలో పాఠశాలల్లో బోధన సాగించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో టీఎల్ఎం మెటీరియల్‌ను తయారు చేయించారు. కార్యక్రమంలో ఏఎంఓ పి.కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓల బృందం

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యలను ఎంఈఓల బృందం గురువారం పరీక్షించింది. విద్యార్థులు తరగతికి తగ్గ నైపుణ్యాలను కలిగి ఉన్నారో లేదో పరీక్షించారు. ఐదుగురు ఉపాధ్యాయుల బృందంతో అన్ని సామర్థ్యలను పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన సరుకులు అందజేయాలి

సీతంపేట: గిరిజన గురుకులాల వసతిగృహాలకు కూరగాయలు, చికెన్ వంటివి నాణ్యమైనవి సరఫరా చేయాలని ఐటీడీఏ ఏపీఓ రోషిరెడ్డి అన్నారు. స్థానిక ఐటీడీఏలో గురువారం టెండర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మంది టెండర్‌దారులు 160 దరఖాస్తులు వివిధ రకాల కూరగాయలు సప్‌లై చేయడానికి టెండర్‌లు కోట్ చేశారు. అధికారులు, టెండర్ దారుల సమక్షంలో బాక్సులు తెరచి టెండర్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మంగవేణి, జీసీసీ డీఎం సంధ్యారాణి, గురుకులం సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేయించుకోవాలి : ఆర్డీఓ

గరుగుబిల్లి: గొట్టివలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 279లో గల భూమిలో పట్టా కలిగిన రైతులు అధికారులచే సర్వే చేయించుకోవాలని ఆర్డీఓ కె.హేమలత అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత రైతులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ శాఖకు కేటాయించిన భూమిపై వివిధ శాఖల అధికారులతో సర్వేను నిర్వహించడం జరుగుతుందని, అందుకు రైతులు తమ పట్టాలను చూపించి సర్వేను చేయించుకోవాలన్నారు. సర్వే సమయంలో రైతులు తమ పట్టాలను చూపించకపోతే అటవీశాఖకు కేటాయించిన భూములలో ఎలాంటి హక్కులు ఉండవని నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. పట్టా కలిగిన రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం ఇప్పించడం గానీ, వేరొక చోట భూమిని మంజూరు చేయడం జరుగుతుందన్నారు. చినమేరంగి సీఐ సిహెచ్.ప్రసాద్ గొట్టివలస సర్పంచ్ బోను చంద్రినాయుడు, సీపీఎం నాయుకులు రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం గ్రామ సమీపంలోని తోటల్లో తయారు చేస్తున్న సారా బట్టీలపై వీరఘట్టం ఎస్.ఐ ఎం.వి.రమణ తమ సిబ్బందితో గురువారం దాడులు చేసారు. సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులు శిరిపురం రాజశేఖర్, ప్రసాద్ లను అదుపులోకి తీసుకుని 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలు అందజేయాలని ఆయన కోరారు.

వైద్య శిబిరాలతో విస్తృత సేవలు



పాలకొండ రూరల్: బెజ్జి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



గరుగుబిల్లి: రోగులకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు



కురుపాం: జగనన్న ఆరోగ్య సురక్షలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



వీరఘట్టం: చిదిమిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజారోగ్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాల ద్వారా విస్తృత సేవలు అందుతున్నాయి. శిబిరాలకు ప్రజాప్రతినిధులు హాజరై ప్రజలకు నమ్మకం కలిగిస్తుంటే... మరోవైపు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అవసరమైన వారు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఉచితంగా మందులు అందుకుంటున్నారు. ఎక్కడికక్కడ శిబిరాల నిర్వహణతో ప్రజల చెంతకే వైద్య సేవలు చేరువవుతున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్

వైద్య సిబ్బంది ఔదార్యం



లక్ష్మి తల్లి బుద్దమ్మకు నగదును అందజేస్తున్న భద్రగిరి సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్యులు, స్టాఫ్‌నర్స్, ఇతర సిబ్బంది అనారోగ్యం పాలై ఆస్పత్రి పాలైన శానిటేషన్ వర్కర్ గంటా లక్ష్మికి ఆర్థిక సాయాన్ని అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆస్పత్రిలో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న లక్ష్మి క్యాన్సర్‌తో బాధపడుతూ విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతోంది. ఆర్థిక ఇబ్బంది ఎదుర్కొంటున్న లక్ష్మి పరిస్థితిని గుర్తించిన వైద్యులు దుర్గాప్రసాద్, రమ్య, శ్రీధర్, హెడ్‌నర్స్ మంగమ్మ, ఇతర సిబ్బంది తమ వంతుగా విరాళాలు సమకూర్చుకొని సమకూరిన మొత్తం రూ.23,700లను లక్ష్మి తల్లి బుద్దమ్మకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్ ఖాన్ ఉన్నారు.

రాయితీపై పుస్తకాల అందజేత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

సీతంపేట: స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న మొదటి సంవత్సరం డిప్లమా విద్యార్థులకు 20 శాతం రాయితీపై పుస్తకాలను అందజేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ గంగస్వామి తెలిపారు. గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు పూర్ణాచారి, గిరీష్, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే



ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం పర్యటనకు గురువారం వచ్చిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గుమ్మలక్ష్మీపురం గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆమె చైర్మన్ దంపతులను దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విజయవంతంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, సీఎం ఆదేశాల మేరకు త్వరలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలపై మాట్లాడారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు ఎద్దు మురళి, వహీద్‌ఖాన్, వైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్, వైస్ సర్పంచ్ కిషోర్ ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



బెజ్జి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

- 'గడప గడప'లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పాలకొండ రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని బెజ్జి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ శివ్వాల శ్రీనివాసరావు నేతృత్వంలో గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లారు. ప్రజల యోగక్షేమాలపై ఆరా తీసారు. గడిచిన నాలుగేళ్లగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సదరు కుటుంబానికి అందించిన సంక్షేమ లబ్ధిని క్షుణ్ణంగా విరించారు. ప్రజల కష్టాలను నేరుగా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు కట్టుబడ్డారన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లో పల్లె వాకిటికి పాలన తీసుకువచ్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిస్తున్నట్లు వివరించారు. ప్రజలు విన్నవించిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులకు సదరు సమస్యల పరిష్కారంపై చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి వసతికి తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, పాలవలస దవశేశ్వరరావు, సత్యంనాయుడు, రాంబాబు, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులున్నారు.

చేప పిల్లల అందజేత



మత్స్యకారులకు చేప పిల్లలు అందజేస్తున్న సర్పంచ్ రమణమ్మ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి సొసైటీ మత్స్యకార సంఘాలకు సర్పంచ్ అల్లు రమణమ్మ చేతుల మీదుగా గురువారం చేపపిల్లలు అందజేసారు. వాటిని చినమేరంగి చెరువులో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణమ్మ మాట్లాడుతూ చేపల పెంపకం పట్ల రైతులు దృష్టి సారించాలన్నారు. చేపల పెంపకం లాభదాయకమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, మత్స్యకార సంఘ సభ్యులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

రోడ్డు ట్యాక్స్ తప్పనిసరిగా చెల్లించాలి



అపరాధ రుసుం విధిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్, సిబ్బంది

కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లా ఆర్టీఓ మల్లికార్జున్ రెడ్డి ఆదేశాల మేరకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్, సత్యనారాయణ గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్డు ట్యాక్స్ చెల్లించని వాహనాలకు పెనాల్టీ విధించారు. వాహన పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వాహన రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్, రోడ్డు ట్యాక్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, వాహనాలను నడిపే సమయంలో సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రహదారి భద్రతపై డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో 27వాహనాలకు లక్షా 63వేల రూపాయలు అపరాధ రుసుం విధించారు

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు : డీఎస్పీ

పాలకొండ: దసరా ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ కృష్ణారావు తెలిపారు. గురువారం పోలీసుస్టేషన్ నుంచి కోటదుర్గమ్మ ఆలయం వరకు ప్రధాన రహదారిని ఆయన సిబ్బందితో పాటు పరిశీలించారు. రద్దీ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు.